సాక్షి అనంతపురం

మంగళవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.48

అనంతపురం మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.48 పలికింది. కనిష్టం రూ.30, సరాసరి రూ.38 ప్రకారం అమ్మకాలు జరిగాయి.



జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

అన్నదాతలపై సర్కారు పిడుగు

అన్నదాతలపై మరో పిడుగు పడింది. ఇప్పటికే పెట్టుబడి సాయం అటకెక్కించడంతో పాటు గతేడాదికి సంబంధించి ఉచిత పంటల బీమా పరిహారంపై నోరు మెదపని కూటమి సర్కారు.. విత్తన పప్పుశనగపై అందించే రాయితీని తాజాగా కుదించేసింది. గతేడాది, ఈ ఏడాది కరువు పరిస్థితుల కారణంగా ఇబ్బంది పడుతున్న తరుణంలో సబ్సిడీ పెంచి విత్తన పప్పుశనగ అందించాల్సింది పోయి కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పప్పుశనగ సాగుకు సిద్ధంగా ఉన్న నల్లరేగడి భూములు (ఇన్‌సెట్‌లో) విత్తన పప్పుశనగ

నేటి నుంచి రబీ సీజన్

- విత్తన పప్పుశనగ రాయితీలో కత్తెర వేసిన ప్రభుత్వం
- 40 నుంచి 25 శాతానికి కుదింపు
- క్వింటాపై గతేడాది కన్నా రూ.2,370 భారం

అనంతపురం అగ్రికల్చర్: రబీ వ్యవసాయ సీజన్ మంగళవారం నుంచి మొదలు కానుంది. అక్టోబర్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు రబీగా పరిగణిస్తారు. ఏటా జూన్ 1 నుంచి సెప్టెంబర్ నెలాఖరు వరకు నాలుగు నెలల పాటు ఖరీఫ్ సీజన్ ఉంటుంది. తర్వాత రబీ మొదలవుతుంది. జిల్లాలో 1.18 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేశారు. అందులో ప్రధానపంట కింద పప్పుశనగ 72 వేల హెక్టార్లు, ఆ తర్వాత వేరుశనగ 21 వేల హెక్టార్లు, మిగతా అన్ని పంటలు కలిపి మరో 25 వేల హెక్టార్ల వరకు సాగులోకి రావచ్చని చెబుతున్నారు. రబీలో ఈశాన్య రుతుపవనాలు ప్రభావం చూపుతాయి. సాధారణ వర్షపాతం 139.3 మి.మీ నమోదు కావాల్సి ఉంటుంది. అందులో అక్టోబర్‌లోనే అత్యధికంగా 100.9 మి.మీ కురవాలి. నవంబర్‌లో 28.6 మి.మీ, డిసెంబర్‌లో 9.8 మి.మీ నమోదు కావాలి.

విత్తన పప్పుశనగ రాయితీకి కత్తెర

రబీలో పప్పుశనగ సాగు చేసే రైతులకు రాయితీతో విత్తనం పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ప్రకటించింది. అందుకోసం జిల్లాకు జేజీ–11 రకం పప్పుశనగ విత్తనం 27,139 క్వింటాళ్లు కేటాయిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే శ్రీ సత్యసాయి జిల్లాకు 1,143 క్వింటాళ్ల విత్తనం కేటాయించారు. అయితే రాయితీ 25 శాతం మాత్రమేనని ప్రకటించారు. క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోనూ క్వింటాకు రూ.7,050 ప్రకారం రైతులు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు గరిష్టంగా 200 కిలోలు అంటే 2 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఒక ఎకరా ఉన్న రైతులకు 10 కిలోలు కలిగిన ప్యాకెట్లు రెండు, రెండు ఎకరాలకు నాలుగు ప్యాకెట్లు, మూడు ఎకరాలకు ఆరు ప్యాకెట్లు, నాలుగు ఎకరాలకు 8 ప్యాకెట్లు, ఐదు ఎకరాలు, అంతకన్నా ఎక్కువగా ఉన్న రైతులకు 10 ప్యాకెట్లు పంపిణీ చేయాలని నిర్ణయించారు.

గతేడాది 40 శాతం రాయితీ..

గత రబీలో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేసింది. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా–పీఎం కిసాన్ అందిస్తూనే.... జూలై నెలలోపే ఉచిత పంటల బీమా కింద పెద్ద ఎత్తున పరిహారం కూడా అందించింది. అలాగే రబీలో విత్తన పప్పుశనగపై 40 శాతం రాయితీ అందించింది. క్వింటా రూ.8,100 కాగా అందులో 40 శాతం రూ.3,240 పోనూ రైతుల వాటా కింద రూ.4,680 ప్రకారం కట్టించుకున్నారు. గతేడాదితో పోల్చితే ఈ సారి క్వింటా మీద రూ.2,370 ప్రకారం అధికంగా భారం మోపడం గమనార్హం. 200 కిలోలు తీసుకునే ఒక్కో రైతుపై రూ.5 వేల వరకు అదనంగా భారం పడనుంది. ఈ లెక్కన ఈ ఏడాది జిల్లా రైతుల నుంచి ఏకంగా రూ.6 కోట్లకు పైగా కూటమి సర్కారు పిండనుంది. కేటాయింపులు, ధరలు ఆలస్యంగా ప్రకటించడంతో రిజిస్ట్రేషన్లు, విత్తన సరఫరా పంపిణీ ప్రక్రియ జాప్యం కావచ్చని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



జేసీ శివనారాయణ శర్మకు పూలమొక్క అందజేస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: డీఎస్‌ఓగా వెంకటేశ్వర్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలిసి పూలమొక్కలను అందజేశారు. మూడు నెలల క్రితం డీఎస్‌ఓగా నియమితులైన వెంకటేశ్వర్లును ఆ వెంటనే అల్లూరి సీతారామరాజు జిల్లాకు డిప్యుటేషన్‌పై ప్రభుత్వం నియమించింది. తాజాగా డిప్యుటేషన్ రద్దు చేయడంతో ఆయన డీఎస్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు.

నేటి నుంచి మద్యం దుకాణాలకు దరఖాస్తులు



అనంతపురం: కొత్త మద్యం పాలసీని అనుసరించి ప్రైవేట్ మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. అనంతపురం ఎక్సైజ్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నుంచి అక్టోబర్ 9వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. జిల్లాలో 136, శ్రీ సత్యసాయి జిల్లాలో 87 ప్రైవేట్ మద్యం షాపులు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆన్‌లైన్ విధానంతో పాటు ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తులు అందించవచ్చన్నారు. జిల్లాలో 10 ఎక్సైజ్ స్టేషన్లు, శ్రీ సత్యసాయి జిల్లాలో 8 ఎక్సైజ్ స్టేషన్‌లలో దరఖాస్తులు తీసుకుంటామన్నారు. ప్రతి స్టేషన్‌లో ఒక డిజిటల్ టెక్నీషియన్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు. అక్టోబర్ 11న లాటరీ పద్ధతిలో షాపులను కేటాయిస్తామన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ మొత్తం తిరిగి ఇవ్వరని స్పష్టం చేశారు. లైసెన్స్ ఫీజు ఎంత చెల్లించాలి? ఇతర వివరాలు నోటిఫికేషన్ విడుదల తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



మృతురాలు గంగమ్మ

రాయదుర్గం: పిడుగుపాటుకు మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని చదం గ్రామంలో జరిగింది. ఎస్‌ఐ వలీ తెలిపిన మేరకు.. చదం గ్రామానికి చెందిన గంగమ్మ (45)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త గతంలోనే మృతి చెందారు. ఈ క్రమంలో కూలి పనులకు వెళ్తూ గంగమ్మ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో మొక్కజొన్న పంటలో కలుపు తీసేందుకు మరో ఆరుగురు మహిళలతో కలిసి సోమవారం గంగమ్మ వెళ్లారు. కలుపు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా వర్షం ప్రారంభం కావడంతో అందరూ సమీపంలో ఉన్న చెట్టు కిందకెళ్లారు. ఈ క్రమంలోనే భీకర శబ్దంతో చెట్టుపై పిడుగు పడింది. గంగమ్మ కుప్పకూలి ఘటనాస్థలిలోనే మృతి చెందింది. మరో కూలీ చిట్టెమ్మ కాలికి గాయమైంది. మిగిలిన ఐదుగురు కూడా స్పృహ కోల్పోయినా కొంత సేపటికే మేలుకున్నారు. గాయపడ్డ చిట్టెమ్మను చికిత్స కోసం రాయదుర్గం ఏరియా ఆస్పత్రికి తరలించారు.గతంలోనే తండ్రి దూరమవడం, పిడుగు రూపంలో నేడు తల్లికూడా మృతి చెందడంతో గంగమ్మ పిల్లలు బోరున విలపించారు. తమకు దిక్కెవరంటూ కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఎక్సైజ్ సీఐల బదిలీ

అనంతపురం: పలువురు ఎక్సైజ్ సీఐ, ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. జిల్లాలో 22 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 15 మంది ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎక్సైజ్ సీఐల నియామకాలు ఇలా..

అనంతపురం	ఎం. సత్యనారాయణ
బుక్కరాయసముద్రం	సి. నాగ సునీత రాణి
గుత్తి	కే. ఉమాదేవి
గుంతకల్లు	ఎం. శివ సాగర్
తాడిపత్రి	జి .నాయుడు
ఉరవకొండ	ఆర్. రవిచంద్ర
కణేకల్లు	ఆర్. ఉమాబాయి
రాయదుర్గం	కే.గణేష్
కళ్యాణదుర్గం	ఎస్ఎండీ హసీనాభాను
కంబదూరు	ఎస్ఎం. రఫీ

భూసేకరణ పూర్తి చేయాలి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ భూసేకరణ, భూ కేటాయింపు ప్రక్రియ వేగవంతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో ఎన్‌హెచ్‌ఏఐ పీడీ తరుణ్‌కుమార్, మేనేజర్ మురళి, ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ ఈఈ సుధాకర్‌రెడ్డి, తదితరులు లు పాల్గొన్నారు.

టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టండి

జిల్లాలో టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. విజయనగర రాజుల చరిత్రపై విజయనగర్ సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాలని నగర పాలక కమిషనర్ నాగరాజును ఆదేశించారు.

పోలీసు స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా వ్యవహరించాలి

అనంతపురం: పోలీసు స్టేషన్‌కు వచ్చేవారితో మర్యాదగా వ్యవహరించాలని ఎస్పీ జగదీష్ ఆదేశారు. అనంతపురం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లాలోని ఎస్‌ఐ, ఆపై స్థాయి పోలీసులతో ఆయన నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ తీవ్రమైన కేసుల్లో తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా పని చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులకు తావివ్వరాదన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచాలన్నారు. అవినీతి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ప్రతిష్ట దిగజార్చే విధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీనివాస్, రామకృష్ణుడు, మహబూబ్‌బాషా, జిల్లాలోని పలువురు సీఐ, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం రూరల్: అర్జీల పరిష్కారంలో అలసత్వం చూపరాదని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 205 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలన్న ఉద్దేశంతో ఆర్డీఓ కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామన్నారు. మండల స్థాయి అధికారులు చిత్తశుద్ధితో పని చేస్తే సమస్యలు జిల్లాకేంద్రం వరకూ రావన్నారు. అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో సఖ్యతగా మెలగాన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



రూ. 15 వేల పింఛన్ మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరుతున్న దివ్యాంగురాలు నాగమణి

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అనంతపురం అర్బన్: ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో గుంతకల్లు, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్లకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్‌తో పాటు డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, పరిపాలనాధికారి అలెగ్జాండర్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 110 వినతులు ప్రజల నుంచి అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులకు తగిన సూచనలు జేసీ అందజేశారు. అర్జీదారుల సంతృప్తి చెందేలా వారి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని...

- గుంతకల్లు మండలంలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో ఎస్సీ, ఎస్టీ రోస్టర్ అమలు చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సూరి, ఎం.కృష్ణమూర్తి విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లావ్యాప్తంగా ఉపాధి పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను రాజకీయ కారణాలతో తొలగించారని చెప్పారు. గుంతకల్లు మండలంలో కొత్తవారి నియామక ప్రక్రియలో రోస్టర్ పాటించడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయించి చర్యలు తీసుకోవాలని కోరారు.
- తమ స్థలాన్ని ఆక్రమించారని కుందుర్పి గ్రామానికి చెందిన శ్రీరాములు ఫిరాదు చేశాడు. మాలవీధిలో తన భార్య చంద్రమ్మ పేరున మూడు సెంట్ల స్థలం ఉంటే అందులో 2.25 సెంట్లలో ఇంటిని నిర్మించుకున్నానని చెప్పాడు. మిగిలిన 0.75 సెంట్ల స్థలాన్ని తిప్పారెడ్డిపల్లికి చెందిన ఒక మహిళ దౌర్జన్యంగా ఆక్రమించిందని చెప్పాడు. విచారణ చేయించి న్యాయం చేయాలని కోరాడు.

సమగ్ర శిక్ష ఇంటర్వ్యూల్లో గందరగోళం

- గుట్టు చప్పుడు కాకుండా మెసేజ్‌లు పంపిన సమగ్రశిక్ష అధికారులు
- మెసేజ్‌లు రాక చాలామంది అభ్యర్థుల ఆందోళన
- నేడు సమగ్రశిక్ష కార్యాలయంలో ఇంటర్వ్యూలు

అనంతపురం ఎడ్యుకేషన్: 'సార్ మీకు మెసేజ్ వచ్చిందా... నాకు రాలేదు, మీకు వచ్చిందా... నాకు మెసేజ్ వచ్చింది, మీకెందుకు రాలేదు' ఇదీ సమగ్రశిక్ష కార్యాలయంలోని సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారుల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పరిస్థితి. ఏఎంఓ, జీసీడీఓ,అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్),అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ అలెస్కో,అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్‌ఓ పోస్టులకు పలువురు అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జాబితాను వడపోసి 14 మందిని మాత్రమే అర్హులుగా తేల్చారు. వారందరినీ ఇంటర్వ్యూకు రావాలంటూ గుట్టు చప్పుడు కాకుండా మెసేజ్‌లు పంపారు. కనీసం ఒక రోజు కూడా గడువు ఇవ్వకుండా సోమవారం మధ్యాహ్నం మెసేజ్‌లు పంపారు. మంగళవారం మధ్యాహ్నం 2.30గంటలకు సమగ్రశిక్ష కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలంటూ సమాచారం పంపారు. కలెక్టర్ వినోద్‌కుమార్ సమక్షంలో డీఈఓ, సమగ్రశిక్ష డీపీసీ, ఏపీసీ, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంటర్వ్యూ చేయనున్నారు. 14 మంది జాబితా వెలువడిన తర్వాత అధికారుల తప్పులను బయటపెడతామంటూ అభ్యర్థులు బాహాటంగానే చెబుతున్నారు.

రహస్యంగా జాబితా తయారీ.. అయినా లీకులు

జిల్లా కేంద్రంలోని ఓ ముఖ్య ప్రజాప్రతినిధి సిఫార్సు చేసిన టీచరు పేరు ఇంటర్వ్యూ జాబితాలో లేదట. పోక్సో కేసులో రిమాండ్‌కు వెళ్లొచ్చిన కారణంగా ప్రజాప్రతినిధి ఎంత ఒత్తిడి చేసినా అధికారులు సదరు టీచరు పేరును అర్హుల జాబితాలో చేర్చే సాహసం చేయలేకపోయారు. ఈ విషయాన్ని విద్యాశాఖలో ఓ కీలక అధికారి లీక్ చేయడంతో సదరు ప్రజాప్రతినిధి తీవ్ర స్థాయిలో అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మరో అధికారికి ఫోన్ చేసి వాకబు చేసినట్లు సమాచారం. రహస్యంగా తయారు చేసిన జాబితా విషయం ఎలా బయటకు పొక్కిందంటూ ఈ ప్రక్రియను చూస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు మదనపడుతున్నారు. ఏ చిన్న విషయం బయటకు పొక్కకూడదంటూ తమకు ఆదేశాలు జారీ చేస్తూ... వారేమో ఇలా పేర్లు బయటకు చెప్పడం ఏంటని సదరు ఉద్యోగులు వాపోతున్నారు.

3 నుంచి ఉపాధ్యాయ అర్హత పరీక్ష

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- జిల్లాలో పరీక్ష రాయనున్న 44,855 మంది అభ్యర్థులు
- అనంతపురంలో 6, తాడిపత్రిలో 2, గుత్తిలో ఒకటి, బెంగళూరులో మూడు కేంద్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)–2024 ఈనెల 3 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఈనెల 21 వరకు టెట్ జరగనుంది. రోజూ రెండు సెషన్లలో పరీక్ష ఉంటుంది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతపురం నగరంలో ఆరు కేంద్రాలు, తాడిపత్రిలో రెండు, గుత్తిలో ఒకటి, బెంగళూరులో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని పేపర్లు కలిపి మొత్తం 44,855 మంది అభ్యర్థులు రాయనున్నారు. కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వైద్యసేవల కోసం ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారన్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లతో పాటు ఎలాంటి ఎల్రక్టానిక్ పరికరాలు అనుమతించబోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు హాల్‌టికెట్, గుర్తింపు కార్డుతో గంటన్నర ముందే కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. పరీక్ష కేంద్రాల వివరాలు https://doeananthapuramu. blogspot.com వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు cse.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని డీఈఓ సూచించారు.

టీచరు దివాకర్ నాయుడిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం ఎడ్యుకేషన్: చిట్టీల పేరుతో రూ. కోట్లకు కుచ్చుటోపీ పెట్టి కటకటాల పాలైన అనంతపురంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు టీచరు కాకర్ల దివాకర్‌నాయుడుపై సస్పెన్షన్ వేటు పడింది. దాదాపు మూడు నెలల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన దివాకర్‌నాయుడు ఇటీవల కోర్టులో లొంగిపోవడంతో జడ్జి ఆదేశాల మేరకు పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన రెడ్డిపల్లి సబ్ జైలులో ఉన్నారు. రిమాండ్ రిపోర్ట్ విద్యాశాఖకు అందింది. ఈ క్రమంలో మూడు రోజుల కిందట షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపునకు అతికించారు. సోమవారం సస్పెన్షన్ ఉత్తర్వులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి జారీ చేశారు. ఆర్ఎంహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. దివాకర్‌నాయుడు ఇంటివద్ద ఈ ఉత్తర్వులను అతికించనున్నారు.

స్కూల్ వద్దకు తిరుగుతున్న బాధితులు

దివాకర్‌నాయుడు అరెస్ట్ విషయం చాలామంది బాధితులకు తెలీదు. ఆయన ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నాడనుకుంటున్నారు. రిమాండ్‌లో ఉన్నాడంటూ ఇటీవల 'సాక్షి'లో కథనం వెలువడటంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చ జరిగింది. ఈ క్రమంలో బాధితులు దివాకర్‌నాయుడు పని చేస్తున్న పాఠశాలకు, డీఈఓ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇంటివద్ద ఎవరూ అందుబాటులో లేకపోవడంతో వచ్చినట్లు బాధితులు తెలిపారు.

ఇంటికి వెళ్లడానికీ అనుమతి కావాలా?

- నేను తాడిపత్రికి వెళ్లేందుకు టీడీపీ నేతల అనుమతి అవసరమా?
- అవసరమని ఎస్పీ చెబితే, జేసీ ప్రభాకర్ రెడ్డిని పర్మిషన్ కోరేందుకు సిద్ధం
- తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- దసరా తర్వాత తాడిపత్రిలోకి అడుగుపెట్టి తీరతానని స్పష్టీకరణ



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం: 'నా ఊరు, నా ఇంటికి వెళ్లడానికి కూడా అనుమతి తీసుకోవాలా?' అని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతి రెడ్డి పెద్దారెడ్డి ప్రశ్నించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్‌కు సోమవారం వినతిపత్రం అందజేసిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. తాను తాడిపత్రికి వెళ్లాలంటే ప్రతి సారీ పోలీసులు అడ్డుపడుతున్నారన్నారు. ఎస్పీ జగదీష్‌ను ఇప్పటికే మూడు దఫాలు నేరుగా కలిశానని, పరిశీలిస్తాం.. ఆలోచిస్తాం అంటున్నారే గానీ ఏ విషయమూ చెప్పడం లేదన్నారు. ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించాలి కానీ ప్రభుత్వం మారి 100 రోజులైనా తాడిపత్రికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. 'తాడిపత్రిలో సొంత ఇల్లు ఉంది. అక్కడ మా కార్యకర్తలు ఉన్నారు. వారి కోసం వెళ్తానని చెప్పినా ఆటంకం కలిగిస్తున్నారు' అని వాపోయారు. దసరా పండుగ తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ తాడిపత్రికి వెళ్లి తీరతానని ఆయన స్పష్టం చేశారు.

ప్రజలకు అండగా ఉండొద్దా..?

ఓ మాజీ ఎమ్మెల్యేగా తాడిపత్రి ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తాను ఎన్ని రోజులు బయట ఉండాలో కూడా చెప్పలేని పరిస్థితుల్లో అధికారులు ఉన్నారన్నారు. తనకు అనుమతి విషయమై టీడీపీ నాయకులతో చెప్పించాల్సిన అవసరముందేమో అర్థం కావడం లేదని, ఒక వేళ అధికారులు ఆ విషయం మీడియాముఖంగా చెబితే జేసీ ప్రభాకర్ రెడ్డినో, ఆయన కుమారుడినో కూడా అడిగేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఎప్పుడూ లేని తరహాలో నేడు రాష్ట్రంలో పరిస్థితులు ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరగకుండా నీచమైన సంస్కృతిని తెచ్చారన్నారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలా జరగలేదన్నారు.

ఎస్పీ కార్యాలయంలోనే నిరసన దీక్ష చేపడతా

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలోనూ 10 నుంచి 15 జూద కేంద్రాలు నిర్వహిస్తున్నారన్నారు. 'ప్రతిపక్ష పార్టీ వాళ్ల లిక్కర్‌షాపులకు టెండర్ వేస్తే పగులగొడతాం, మేం చెప్పిందే శాసనం' అని నేడు ఎమ్మెల్యేలు చెబుతున్నారన్నారు. అరాచకాలు ఇలాగే కొనసాగితే తాము రోడ్లమీదకు వచ్చి నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. అల్లర్ల కేసులో ఇప్పటికే తనకు హైకోర్టు కూడా బెయిల్ ఇచ్చిందన్నారు. కేవలం 15 రోజులు తాడిపత్రికి వెళ్లొద్దని అప్పట్లో న్యాయమూర్తి సూచించారన్నారు. కానీ పోలీసు అధికారులు మాత్రం లా అండ్ ఆర్డర్ సమస్య ఉందని చెబుతూ వెళ్లనీయడం లేదన్నారు. తనను అడ్డుకోవడానికే ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ నుంచి కానిస్టేబుళ్లను బందోబస్తుకు పంపుతున్నారని, కానీ, వారు ఎక్కడ బందోబస్తు నిర్వహిస్తున్నారో తెలియడం లేదన్నారు. ఇప్పటికైనా తనను తాడిపత్రి నియోజకవర్గంలోకి వెళ్లడానికి అనుమతి ఇవ్వాలని, లేకుంటే ఎస్పీ కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతానని స్పష్టం చేశారు. 'నేను మందీమార్బలంతో రాను. ఒక్కడినే వస్తా. ఎస్పీ కార్యాలయ ఆవరణలో చెట్టు కింద కూర్చుని నిరసన దీక్ష చేస్తా.' అని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోరా?

'ఇసుక తోలనీను. అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటానని జేసీ ప్రభాకర్ రెడ్డే అంటాడు. ఆ తర్వాత ఆయనే మా వాళ్లే అక్రమంగా ఇసుక తోలుతున్నారు, గంజాయి అమ్ముతున్నారు అని నిస్సిగ్గుగా మాట్లాడతాడు. మా ఫ్యాక్టరీకి ఇసుక తోలుతున్నా అని బాహాటంగానే పేర్కొన్నాడు. ఎవరు అడ్డు వస్తారో రండి అంటూ సవాల్ కూడా చేశాడు. దీనికి సంబంధించిన వీడియోను ఎస్పీ దృష్టికి సైతం తీసుకెళ్లాను. అయినా, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు' అని కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. ఇసుక అక్రమాలపై వార్తలు రాశారని ఇటీవల పత్రికా విలేకరులపైనా అవాకులు చెవాకులు పేలాడన్నారు. ఇంత అహంకారంగా మాట్లాడే వ్యక్తికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు కచ్చితంగా వస్తాయని హెచ్చరించారు.

ధర్నాలతో అట్టుడికిన కలెక్టరేట్

ధర్నాలతో సోమవారం కలెక్టరేట్ ప్రాంతం అట్టుడికింది. సమస్యల పరిష్కారం కోరుతూ తాగునీటి సరఫరా ప్రాజెక్ట్ కార్మికులు, సచివాలయ ఏఎన్ఎంలు, చేనేత కార్మికులు కదం తొక్కారు. ఆందోళనలకు సీఐటీయూ, ఏఐటీయూసీ, జేసీఐపీ నేతృత్వం వహించాయి.



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన చేనేత కార్మికులు, జేసీఐపీ నాయకులు



తాగునీటి సరఫరా కార్మికుల ఆందోళనలో మాట్లాడుతున్న ఓబులు

- నేతన్న నేస్తం అమలు చేయాలంటూ చేనేత కార్మికుల ఆందోళన
- సమస్యల పరిష్కారానికి ఏఎన్ఎంల ధర్నా
- వేతన బకాయిలు చెల్లించాలంటూ తాగునీటి సరఫరా పథకం కార్మికుల ఆందోళన

అనంతపురం అర్బన్: చేనేత కార్మికులను ఆదుకోవాలని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ (జేసీఐపీ) జాతీయ ప్రధాన కార్యదర్శి నీలూరి రుషింగప్ప డిమాండ్ చేశారు. నేతన్న నేస్తం పథకం అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించాలంటూ జేసీఐపీ ఆధ్వర్యంలో చేనేత కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రుషింగప్ప మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలను నేరుగా చేనేత కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తూ వచ్చిందన్నారు. నేతన్నలకు ఇచ్చిన హామీల మేరకు పట్టు రాయితీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తక్షణం అమలు చేయాలన్నారు. అనంతరం జేసీ శివనారాయణ శర్మకు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఏపీ రమణ, జగన్‌మోహన్‌రెడ్డి, నగేష్, శ్రీనివాసులు, ఖాసీంవలి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మూల్యం చెల్లించుకోక తప్పదు

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని కూటమి ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ హెచ్చరించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు తిరుపతి లడ్డూ అంశాన్ని తెరపైకి తెచ్చి రాజకీయాలకు వాడుకోవాలని ఏ సనాతన ధర్మంలో ఉందో చెప్పాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను ప్రశ్నించారు. జిల్లాలో నీటి సరఫరా ప్రాజెక్టు, పంచాయతీ కార్మికులకు నెలలుగా వేతనం చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారో సమాధానం చెప్పాలన్నారు. ఐడీ చట్టం ప్రకారం 240 రోజులు పనిచేసిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్న సుప్రీం కోర్టు తీర్పులు, కార్మిక చట్టాలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అనంతరం వినతిపత్రాన్ని జేసీ శివనారాయణ శర్మకు అందజేశారు. గోపాల్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న సచివాలయ ఏఎన్ఎంలు

సచివాలయ ఏఎన్ఎంల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి డిమాండ్ చేశారు. లేకుంటే దశలవారీగా ఆందోళనలు విస్తృతం చేస్తామని హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సచివాలయ ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత సచివాలయాల పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్యదర్శులను వారి మాతృశాఖలకు బదలాయించారని కానీ, ఏఎన్ఎంలను ఆరోగ్యశాఖకు బదలాయించకుండా నిర్లక్ష్యం వహించారని మండిపడ్డారు. తక్షణం వారిని ఆరోగ్యశాఖకు కేటాయించడంతో పాటు గ్రేడ్-2 పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం జేసీ శివనారాయణశర్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, రజని, నాయకురాళ్లు విజయభారతి, తైరాభాను, పద్మావతి, జయలక్ష్మి, మంజుల, సావిత్రి పాల్గొన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌కు చిన్నారి అపురూప కానుక



తాను గీసిన చిత్రాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందజేస్తున్న విద్యార్థిని నవ్యశ్రీ

అనంతపురం అర్బన్: కలెక్టర్ వినోద్‌కుమార్‌కు విద్యార్థిని నవ్యశ్రీ అపురూప కానుకను సమర్పించింది. రాయదుర్గంలోని జెడ్పీ హెచ్ఎస్‌లో పదో తరగతి చదువుతున్న పి.నవ్యశ్రీ పెన్సిల్‌తో కలెక్టర్ ముఖ చిత్రాన్ని గీసింది. సోమవారం ఉదయం ఈ చిత్రాన్ని డీఆర్‌డీఏ కార్యాలయంలోని పీడీ చాంబర్‌లో కలెక్టర్‌కు ఆ బాలిక అందజేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ హర్షం వ్యక్తం చేస్తూ బాలికను అభినందించారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, పాఠశాల హెచ్ఎం జయప్రద, ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, బాలిక తల్లిదండ్రులు వెంకటేశ్వరి, నరసింహులు పాల్గొన్నారు.

రూ.4 కోసం విధ్వంసం!

పెద్దపప్పూరు: నాలుగు రూపాయల కోసం తాగుబోతులు గొడవ పెట్టుకుని ఓ హోటల్‌ను ధ్వంసం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద నరసాపురం గ్రామానికి చెందిన నారాయణస్వామి చిన్నపాటి హోటల్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి చీమలవాగుపల్లికి చెందిన మధు, అమర్, కులశేఖర్, సుధాకర్ మద్యం మత్తులో అక్కడకు చేరుకుని సిగరెట్లు తీసుకుని రూ.4 మళ్లీ ఇస్తామంటూ వెళుతుండగా నారాయణ స్వామి అడ్డుకుని చిల్లర గుర్తుకుండదని, ఉంటే ఇప్పుడే ఇచ్చి వెళ్లాలని అడిగాడు. దీంతో నలుగురూ ఒక్కసారిగా హోటల్‌లో చేతికి చిక్కిన సామగ్రిని తీసుకుని బండకేసి కొడుతూ విధ్వంసానికి పాల్పడ్డారు. దాదాపు రూ.10 వేలు విలువైన సామగ్రి ధ్వంసమైంది. సోమవారం ఉదయం బాధితుడి నుంచి ఫిర్యాదు అందుకున్న ఎస్ఐ గౌస్‌బాషా నలుగురిపై కేసు నమోదు చేశారు.

సిఫారసు బదిలీల ప్రక్రియను వెంటనే ఆపాలి : ఏపీటీఎఫ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులకు సంబంధించి సిఫారసు బదిలీల ప్రక్రియను వెంటనే ఆపాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జోనల్ సమావేశం జరిగింది. జోనల్ కార్యదర్శి సతీష్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆ శాఖ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే సిఫారసు బదిలీలు చేయబోమంటూ ఎన్నికల సమయంలో నారా లోకేష్ హామీనిచ్చారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తర్వాత అనేక జిల్లాల్లో సిఫారసు బదిలీలు చేయడానికి రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు. తక్షణమే ఈ ప్రక్రియను ఆపి కౌన్సెలింగ్ విధానంలో మాత్రమే చేపట్టాలనానరు. నాయకులు బి.వెంకటేశులు, జీపీ రమణ, సర్దార్ వలి, వన్నప్ప, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



కావ్యాంజలి

గార్లదిన్నె: మండలంలోని ముకుందాపురానికి చెందిన వివాహిత కావ్యాంజలి కనిపించడం లేదు. ఈ మేరకు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా సోమవారం వెల్లడించారు. మల్లమ్మ, సతీష్ దంపతుల కుమార్తె కావ్యాంజలికి ఏడాది క్రితం కళ్యాణదుర్గానికి చెందిన యువకుడితో వివాహమైంది. మూడు నెలల క్రితం భర్తతో గొడవపడి పుట్టింటికి చేరుకున్న ఆమె అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రూ.3 లక్షల నగదు అపహరణ

గుంతకల్లు: ద్విచక్ర వాహనంలో ఉంచిన రూ.3 లక్షల నగదు అపహరణకు గురైంది. బాధితుడు తెలిపిన మేరకు... గుంతకల్లులోని హౌసింగ్‌బోర్డులో నివాసముంటున్న వేణుగోపాలరెడ్డి... కసాపురంలోని జెడ్పీ హెచ్ఎస్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో తన కుమారుడి వివాహ నిశ్చితార్థానికి సంబంధించి డబ్బు అవసరం కావడంతో స్థానిక యూనియన్ బ్యాంక్‌లోని తన ఖాతా నుంచి రూ.3 లక్షల నగదును సోమవారం విత్‌డ్రా చేసి, ద్విచక్ర వాహనంలో ఉంచుకుని బయలుదేరారు. మార్గం మధ్యలో పాత క్రౌన్ థియేటర్ సమీపంలో ఓ షాపు వద్ద బైక్ నిలిపి లోపలికెళ్లి పని ముగించుకుని వచ్చేలోపు నగదును దుండగులు అపహరించుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి రూరల్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని నందలపాడుకు చెందిన గురుమూర్తి (50) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జీవితంపై విరక్తితో సోమవారం తెల్లవారుజామున చల్లవారపల్లి రైల్వే గేటు వద్దకు చేరుకుని రైలు కింద పడ్డాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనపై తాడిపత్రి రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పలకరిస్తే చాలు.. అదే పదివేలు

- కుటుంబసభ్యుల నిరాదరణలో రాలిపోతున్న పండుటాకులు
- రోడ్డున పడిన వృద్ధులను ఆదరిస్తున్న ఆశ్రమాలు

సందర్భం నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం



వృద్ధులకు సేవలందిస్తున్న యర్రగుంట దేవి

అనంతపురం కల్చరల్: జీవన సాగరంలో ఎన్నో సుడిగుండాలను దాటి వచ్చిన వారు మలిసంధ్యలో ఆత్మీయ పలకరింపు కోసం తహతహలాడుతున్నారు. వారికి సిరిసంపదలు అక్కర్లేదు. రాజభోగాలు అంతకన్నా అవసరం లేదు. పలకరిస్తే చాలు పులకరించిపోతారు. ఆత్మీయులను చూడగానే పసిపిల్లలైపోతారు. నిండైన ఆప్యాయతను, స్వచ్ఛమైన ప్రేమను పంచుతారు. 'అనుభవంతో రాటుదేలిన వృద్ధులు జాతి సంపద' అని వారి ప్రాధాన్యతను తెలియజేయడానికి ప్రతి అక్టోబరు 1న 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో మంగళవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా అనేక స్ఫూర్తిదాయక కార్యక్రమాలు జరుగనున్నాయి.

పిల్లలు కాదనుకుని చీదరించుకుంటే...

వృద్ధాప్యం వస్తోందంటే భయపడిపోయేవారి సంఖ్య అధికంగానే ఉంటుంది. భావవైరుధ్యంతో పిల్లలు దూరంగా ఉండడం, వంట్లో శక్తి ఆవిరైపోతుంటే కనీసం తమ పనులు తాము చేసుకోలేని స్థితికి చేరుకోవడం వంటి అంశాలు ఎవరికైనా ఆందోళన కలిగించక మానవు. శేష జీవితంపై పెట్టుకునే దిగులు కూడా వారికొచ్చే అనారోగ్యాలకు ఓ కారణమవుతుంటాయి. పిల్లలే కాదనుకుని చీదరించుకుంటే... మానవత్వం పరిమళించే ఎందరో సేవామూర్తుల పంచన చేరి వృద్ధాప్యాన్ని హాయిగా గడిపేస్తున్నారు.

ఆత్మవిశ్వాసం నింపుకుంటూ

వృద్ధాప్యాన్ని జయించడానికి చాలామంది మలి వయసులో తమకంటూ ప్రత్యేకంగా కొన్ని వ్యాపకాలు పెట్టుకుంటున్నారు. సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ పేరుతో 1986లోనే జిల్లా కేంద్రంలో ఓ సంఘాన్ని వృద్ధులు ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రకాలైన సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ప్రతి నెలా ఉచితంగా బీపీ, షుగర్, బ్లడ్ గ్రూపింగ్ టెస్టులు, వివిధ వృద్ధాశ్రమాల వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తుంటారు. అలాగే పెన్షనర్ల సంఘాలు, ఆధ్యాత్మిక సంఘాలలో ఉంటున్న వృద్ధులు సైతం వృద్ధాశ్రమాలకు మానవతా దృక్పథంతో అండగా నిలుస్తున్నారు.

నేడు వృద్ధుల దినోత్సవం

ఆపద్బంధు సేవా ట్రస్ట్, సాయి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురంలోని కొత్తూరు వాసవీ భవన్‌లో మంగళవారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు ప్రారంభిస్తారని నిర్వాహకులు విజయసాయి, నాగభూషణం తెలిపారు. ఎనలేని సేవలందిస్తున్న వృద్ధాశ్రమాల నిర్వాహకులకు చేయూతనందివ్వడంతో పాటు వస్త్ర దానాలు, ఉచితంగా మందుల వితరణ, భోజన వసతి కల్పించనున్నారు.

వృద్ధాశ్రమాలు లేని సమాజముండాలి



ప్రభుత్వాలకు వృద్ధుల గురించి ఆలోచించే తీరిక లేదు. వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు వృద్ధాశ్రమాలను సందర్శిస్తే సమస్యలు తెలుస్తాయి. వృద్ధాశ్రమాలు లేని సమాజాన్ని నిర్మించాలంటే చట్టాలు మరింత కఠినంగా ఉండాలి. ఆశ్రమాల్లోకి వచ్చిన వృద్ధులు జీవితంలో తాము ఎదుర్కొన్న కష్టాలు, రాల్చిన కన్నీళ్లు మరిచి కొత్త జీవితాలను ఆరంభించి ఆనందంగా గడుపుతున్నారు.

– యర్రగుంట కృష్ణారెడ్డి, ఆశ్రయ వృద్ధాశ్రమం, కాట్నేకాలువ గ్రామం

ఆర్టీసీ సీటీఎంగా శ్రీలక్ష్మి

అనంతపురం క్రైం: ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా విజయవాడ ఆర్టీసీ ఎండీ కార్యాలయ చీఫ్ పర్సనల్ మేనేజరు శ్రీలక్ష్మి పదోన్నతిపై రానున్నారు. మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ఇప్పటి వరకూ ఆ స్థానంలో పనిచేసిన రమేష్‌ను డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి

యాడికి: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు... యాడికిలోని లాలెప్ప కాలనీలో నివాసముంటున్న నాగమ్మ(80)కు ఇద్దరు కుమారులున్నారు. పెళ్లి అయిన తర్వాత ఇద్దరు కుమారులు వేర్వేరు కాపురం ఉంటున్నారు. దీంతో వారు నివసిస్తున్న ఇంటి వద్ద ఉన్న ఓ రేకుల షెడ్డులో నాగమ్మ జీవనం కొనసాగిస్తోంది. తాడిపత్రి మండలం గంగాదేవిపల్లి వద్ద తమకున్న సొంత పొలంలో సాగుచేసిన కొర్ర పంటను కూలీలతో కోయించి సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నాగమ్మ ఇంటికి చేర్చింది. 3.30 గంటలకు స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లిన ఆమె అక్కడ తెగిపడిన విద్యుత్ తీగను గమనించకుండా తాకడంతో షాక్‌కు గురై, అక్కడికక్కడే మృతి చెందింది. గమనించిన కుటుంబసభ్యులు బంధుమిత్రులకు సమాచారం అందించి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

శేష జీవితం ఆనందంగా గడపండి

- ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు కలెక్టర్ సూచన



ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖల ఉద్యోగులతో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. సమయం ఉంటుంది కాబట్టి సామాజిక సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వివిధ శాఖల ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో సామూహిక సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, ఉద్యోగులకు సన్మానం చేశారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, పరిపాలనాధికారి అలెగ్జాండర్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నేత భూకబ్జా


- న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతుల వేడుకోలు



డీటీ సుజాతకు వినతి పత్రం ఇస్తున్న దంపతులు నరసమ్మ, ముసలన్న

బొమ్మనహాళ్: పట్టాదారు పాసు పుస్తకాలు చేయిస్తానని నమ్మించి రూ.50 వేలు తీసుకోవడంతో పాటు నాలుగు ఎకరాల భూమిని కాజేశారంటూ వృద్ధ దంపతులు వాపోయారు. ఈ మేరకు బొమ్మనహాళ్ డిప్యూటీ తహసీల్దార్ సుజాతను సోమవారం కలసి ఫిర్యాదు చేసి, మాట్లాడారు. బొమ్మనహాళ్ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన నరసమ్మ, ముసలన్న దంపతులు కొన్నేళ్లుగా కొలగానహళ్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 147లో ఆరు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు చేయిస్తానంటూ ఏడేళ్ల క్రితం రూ.50 వేలను వరుసకు అల్లుడైన టీడీపీ నాయకుడు ఆంజనేయులు తీసుకున్నాడు. ఈ క్రమంలో వృద్ధులను మోసగిస్తూ నాలుగు ఎకరాలను ఆయన భార్య అచ్చమ్మ పేరుతో పట్టాదారు పాసు పుస్తకాలు చేయించుకుని బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడు. సంవత్సరాలు గడిచినా ఆంజనేయులు పట్టాదారు పాసుపుస్తకాలు చేయించకపోవడంతో ఇటీవల రెవెన్యూ అధికారులను నేరుగా కలసి అడిగారు. ఆ సమయంలో ఆంజనేయులు చేసిన మోసం బయటపడింది. దీనిపై తమకు న్యాయం చేయాలంటూ వృద్ధ దంపతులు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఇంటింటికీ గ్యాస్ సౌకర్యం ఓ వరం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి

పామిడి: ఇంటింటికీ వంట గ్యాస్ సౌకర్యం రావడం ఓ వరం లాంటిదని పామిడి తహసీల్దార్ శ్రీధరమూర్తి అన్నారు. హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇంటింటికీ గ్యాస్ సౌకర్యంపై సోమవారం పామిడి మండలం దేవరపల్లిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తహసీల్దార్‌తో పాటు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కేశవ్, జిల్లా ఫైర్‌స్టేషన్ అధికారి లింగమయ్య, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శశికళ, వైద్యులు శివకార్తీక్‌రెడ్డి, ఉదయ్ హాజరై, మాట్లాడారు. వంట గ్యాస్ సిలిండర్ల సౌలభ్యాన్ని మరింత సులభతరం చేస్తూ ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా ఎల్‌పీజీని సరఫరా చేసేందుకు ముందుకు వచ్చిన హెచ్‌పీసీఎల్‌ను అభినందించారు. పైప్ లైన్‌లో ఎక్కడేగాని లీకేజీలు చోటు చేసుకోకుండా అత్యంత సురక్షిత ప్రమాణాలను పాటించనున్నట్లు హెచ్‌పీసీఎల్ ప్రతినిధులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వై సూర్యనారాయణ, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురము: గత నెలలో జిల్లా వ్యాప్తంగా మంచి పనితీరు కనపరిచిన 46 మంది పోలీసులను సోమవారం జిల్లా ఎస్పీ జగదీష్ అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. నిందితులను సకాలంలో కోర్టు ముందు హాజరు పరిచి రెండు జీవిత కాలాల శిక్షలు పడేలా కృషి చేయడం, హత్యకేసుల్లో యావజ్జీవ శిక్షలు పడేలా కోర్టులకు సహకరించడం, సంచలనం రేకెత్తిన ఏటీఎం కేంద్రాల్లోని చోరీలు ఛేదింపు ఘటనల్లో శ్రమించడం, దొంగలను అరెస్టు చేసి ద్విచక్ర వాహనాలు రికవరీ చేసిన పోలీసులను అభినందించారు. సీఐలు ఇస్మాయిల్, సాయినాథ్, శాంతిలాల్, ప్రతాప్ రెడ్డి, షేక్ జాకీర్, ఎస్ఐలు నాగమధు, సాగర్, గౌస్ మహమ్మద్ బాషాపవన్‌కుమార్, రాజశేఖర్ రెడ్డి, అలాగే ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

నాగరాజు నాయక్‌కు డాక్టరేట్

అనంతపురం: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం తిరుపతిలో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో పరిశోధన చేసిన శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం ఎర్రవంక పల్లి గ్రామానికి చెందిన ఎం.నాగరాజు నాయక్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎం.పద్మావతమ్మ పర్యవేక్షణలో 'ప్రైవసీ ప్రవెన్షన్ అండ్ నెట్‌వర్క్ సెక్యూరిటీ ఇన్ క్లౌడ్ విత్ సీఎస్ఎస్ హైబ్రిడ్ క్రిప్టోగ్రఫిక్ స్కీం' అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

హౌసింగ్ ఏఈ, సర్వేయర్ బాధ్యతల స్వీకరణ

ఆత్మకూరు: మండల నూతన హౌసింగ్ ఏఈగా జమీల్ అహమ్మద్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఈయన అనంతపురం అర్బన్ ఏఈగా పని చేశారు. బదిలీపై ఆత్మకూరుకు వచ్చారు. అలాగే మండల సర్వేయర్‌గా గోవిందరాజులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన శింగనమల మండల సర్వేయర్‌గా పని చేశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న అధికారులకు ఆయా శాఖల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక సైన్స్ సెంటర్‌లో సోమవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై విద్యాశాఖ సహకారంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజెంటేషన్, పాటలు, లఘునాటికల పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విభాగాల్లో 314 మంది విద్యార్థులు పాల్గొన్నారు. బాల్య వివాహాలు అరికట్టడంలో సమాజం పాత్ర అనే అంశంపైనా పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారి జాబితాను డీఎంహెచ్‌ఓ ప్రకటించారు. ఈనెల 11న అంతర్జాతీయ బాలికల దినోత్సవం రోజున కలెక్టర్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తారని అధికారులు తెలిపారు.

శరన్నవరాత్రులకు ఏర్పాట్లు పూర్తి

అనంతపురం కల్చరల్: నగరంలోని శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో సోమవారం దసరా నవరాత్రుల వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రతినిధులు జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ మాట్లాడుతూ.. పది రోజుల పాటూ అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు సాగుతాయని తెలిపారు. అలాగే రెండో రోడ్డులోని శ్రీజ్ఞానపీఠం అధ్యక్షుడు విద్యానందనాథ ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి అమ్మవారికి శ్రీచక్రార్చన, చండీపారాయణం, గణపతి తర్పణ, కుంకుమార్చనలతో పాటు రోజుకొక హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలందుకోవాలని కోరారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో జరిగే దసరా వేడుకల వివరాలను కార్పొరేటర్ గురుశేఖరబాబు తెలిపారు. దసరా సందర్భంగా ముత్యాలమ్మ తల్లిని వినూత్న రూపాలలో అలంకరించి సేవలందించడం జరుగుతుందన్నారు.

జగ్జీవన్ జ్యోతి పథకం అమలు చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు సంబంధించిన జగ్జీవన్ జ్యోతి పథకాన్ని వెంటనే అమలు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నెరమెట్ల ఎల్లన్న సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నివసించే వారికి మాత్రమే వర్తింపజేస్తామని చెప్పడం సరికాదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు నివసిస్తున్న ప్రాంతంతో సంబంధం లేకుండా పథకాలన్ని అందించాలని సూచించారు. ఇప్పటికే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కూడా స్పందించి.. పథకాన్ని అమలు చేయాలని అధికారులను ఆదేశించారన్నారు.


ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న కోతులు

వానరాలపై మమకారం

ఎవరైనా కోతులను చూస్తే భయపడి పరుగులు తీస్తారు. కాని ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని వానరాలు ఆ కార్యాలయ సిబ్బందికి కొంచెం స్పెషల్ అనే చెప్పవచ్చు. రోజూ పదుల సంఖ్యలో కోతులు కార్యాలయ ఆవరణలోని చెట్లపై సందడి చేస్తూ తిరుగుతుంటాయి. అయితే అవి ఎవరికీ హాని కలిగించకుండా ప్రతి ఒక్కరి దగ్గరకు సరదాగా వస్తుంటాయి. దీంతో కార్యాలయంలో పని చేసే కొంత మంది సిబ్బంది వాటి మీద ప్రేమతో తినడానికి, తాగడానికి ఏదో ఒకటి తెచ్చి నేరుగా అందిస్తుంటారు. సోమవారం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో పదుల సంఖ్యలో కోతులు తహసీల్దార్ కార్యాలయంలోని చెట్ల కిందకు చేరాయి. అక్కడే ఉన్న తహసీల్దార్ కార్ డ్రైవర్ వలీ బాషా.. వాటర్ బాటిల్‌లో నీరు తీసుకొచ్చి కోతులకు తాపించి, మానవత్వం చాటుకున్నాడు. – ఆత్మకూరు:


వానరానికి నీరు తాపుతున్న డ్రైవర్ వలీ బాషా

'బోర్డుపై పేపర్లు తొలగించారు'

సాక్షి ఎఫెక్ట్..


సచివాలయ శిలాఫలకంపై పేపర్లను తొలిగించిన దృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట పంచాయతీ పరిధిలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రాల శిలాఫలకాలపై అతికించిన పేపర్లను తొలిగించారు. ఇందిరమ్మ కాలనీలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పరిటాల సునీత ఇటీవల భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అయితే పాత కురుగుంటకు వెళ్లే దారిలో గత ప్రభుత్వంలో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాల్లో ఉద్యోగులు కార్యకలాపాలు సాగిస్తున్నారు. అయితే వాటికి ఏర్పాటు చేసిన బోర్డుల్లో పేర్లు కనిపించకుండా కొందరు స్థానిక టీడీపీ నాయకులు పేపర్లు అతికించారు. దీనిపై 'సాక్షి'లో ఇటీవల 'ఇక్కడ అలా.. అక్కడ అలా' శీర్షికతో వెలువడిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వెంటనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాల వద్ద బోర్డులపై ఉన్న పేపర్లను తొలిగించారు.

3 నుంచి బ్రహ్మోత్సవాలు

అనంతపురం కల్చరల్: స్థానిక ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వరాలయంలో ఈనెల 3 నుంచి 12 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజు శ్రీవారికి కైంకర్య సేవలు, రాత్రి వాహన సేవ లుంటాయని పేర్కొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

అనంతపురం కార్పొరేషన్: రోడ్లపై చెత్త కన్పించకూడదని, ఎప్పటికప్పుడు చెత్తను కంపోస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సప్తగిరి సర్కిల్, సాయినగర్, రాంనగర్, క్లాక్‌టవర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. పారిశుధ్యం మెరుగుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్, తదితర వాటిని చల్లాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

విధుల్లో చేరిన సీఓలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలోని మెప్మా విభాగంలో ఆరుగురు కమ్యూనిటీ ఆర్గనైజర్లు విధుల్లోకి చేరారు. సోమవారం నగరపాలక సంస్థలో కమిషనర్ నాగరాజును వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసి మహిళా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అందించే రుణాలు సక్రమంగా వినియోగించుకునేలా మహిళలకు తెలియజేయాలన్నారు. విధుల్లోకి చేరిన వారిలో గుత్తి నుంచి సుమన దుర్గా, గుంతకల్లు నుంచి వనజాక్షి, రామాంజనేయులు, మనోప్రియ, ధర్మవరం నుంచి రత్నమ్మ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నైతిక విలువలు పెంపొందించడమే లక్ష్యం


కరపత్రాలను చూపుతున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జమాతే ఇస్లాం హింద్ మహిళా విభాగం వారు 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే నినాదంతో 30 రోజుల పాటూ నిర్వహించిన ఉద్యమాన్ని సోమవారం ముగించారు. ఈ సందర్భంగా వారు మానవ హక్కుల సంఘం రాష్ట్ర నాయకులు, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్యను కలిసి మద్దతు కోరారు. స్వేచ్ఛ పేరుతో నేడు సమాజంలో దిగజారిపోతున్న విలువలను మళ్లీ పెంపొందించడమే లక్ష్యంగా దేశవ్యాప్త ఉద్యమం జరుగుతోందన్నారు. అందులో భాగంగా నగరంలోనూ జమాతే ఇస్లాం హింద్ అనేక మందిని కలిసి చైతన్యం తెచ్చే విధంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. పాశ్చాత్య ధోరణితో నా శరీరం నా ఇష్టం అనే విధానంలో దుర అలవాట్లకు లోనవుతున్న వారిని మార్చడమే ఉద్యమ ప్రధాన లక్ష్యమని జేబిహెచ్ సంస్థ జిల్లా అధ్యక్షురాలు ఆయేషా తెలిపారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు పర్వీన్, సల్మా, భాను, రెహాన, ఫాతిమా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


కమిషనర్ ఎస్.నాగరాజుకు ఆదేశాలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని ఆగిపోయిన అభివృద్ధి పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ నాగరాజును మేయర్ వసీం ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థలోని మేయర్ చాంబర్‌లో అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలోని రూ.13.85 కోట్లతో కొన్ని నెలల క్రితం టెండర్లు పిలిచినా.. ఆ పనులు ఇప్పటిదాకా ప్రారంభించకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. గతంలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభమైన కూడా పలు ప్రాంతాల్లో అర్థాంతరంగా ఆగిపోయాయని గుర్తు చేశారు. ఆ పనులు వెంటనే చేపట్టేలా చూడాలని తెలిపారు. జేఎన్‌టీయూ రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేసి ఇంకా మొక్కలు నాటకుండా వదిలేశారని.. వెంటనే మొక్కలు పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిధులను గుర్తించిన పనులకు ఉపయోగించాలని పేర్కొన్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో రోడ్లకు గుంతలు పడ్డాయని మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టాలని సూచించారు. కుక్కకాటు బాధితుల సంఖ్యలో పెరుగుతోందని.. కుక్కలను తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.25 కోట్లతో స్పెషల్ గ్రాంట్ వచ్చిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యచరణ సిద్ధం చేయాలన్నారు. అనంతపురంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవడం లేదని, దానిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు.

శ్మశాన వాటిక శుభ్రం చేయించాలి

దసరా పండుగను పురస్కరించుకుని పెద్దల పండుగ చేసుకుంటారు. నగరంలోని అన్ని శ్మశాన వాటికలను శుభ్రం చేయించి పూజలు చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. నగరంలో చాలా ప్రాంతాల్లో లైట్లు సరఫరా చేయకుండా ఉన్నారని వాటిని పరిశీలించాలన్నారు. టౌన్ ప్లానింగ్ ద్వారా భవనాలకు ఇస్తున్నటువంటి అనుమతులు వాటి గురించి పరిశీలించి అతిక్రమణలు ఉంటే వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తాగునీటి సమస్య లేకుండా ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకునేలా చూడాలని ఆదేశించారు.

తపాలా శాఖలో కిరికిరి

- బాధ్యతలు అప్పగించకుండానే రిటైర్డ్ అయిన ఉద్యోగి

అనంతపురం సిటీ: అనంతపురం తపాలా శాఖలో అంతా ఇష్టారాజ్యంగా నడుస్తోంది. ఓ ఉద్యోగి మరో ఉద్యోగికి బాధ్యతలు అప్పగించకుండానే ఉద్యోగ విరమణ చేయడం దుమారం రేపుతోంది. తపాలా శాఖ ఉద్యోగుల కథనం ప్రకారం.. శింగనమల సబ్ పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వర్లు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో అనంతపురం డివిజనల్ కార్యాలయంలోని పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ విభాగంలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పని చేస్తున్న పవన్ కుమార్‌రెడ్డిని నియమించారు. ఆయన పది రోజుల కిందట అనంతపురంలో రిలీవ్ కూడా అయ్యారు. అయితే శింగనమలలో మాత్రం జాయిన్ కాకుండా కాలయాపన చేశారు. వెంకటేశ్వర్లు రిటైర్డ్ కావడానికి ముందే పవన్ కుమార్‌రెడ్డికి అన్నీ రికార్డులు, ఇతర బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. అందుకు ఆయన సిద్ధంగా ఉన్నా పవన్ కుమార్‌రెడ్డి సిద్ధంగా లేకపోయారని తెలుస్తోంది. దీంతో బాధ్యతలు అప్పగించకుండానే వెంకటేశ్వర్లు రిటైర్డ్ అయిపోయారు.

శింగనమల వెళ్లని పవన్..

పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) డెవలప్‌మెంట్ ఆఫీసర్ పవన్‌కుమార్‌రెడ్డి అనంతపురంలో సుమారు నాలుగేళ్లుగా పని చేస్తున్నారు. అనంతపురంలోని అరవింద్‌నగర్ పోస్ట్ ఆఫీస్‌లో ఎస్‌పీఎం పోస్టు నెల కిందట ఖాళీ ఏర్పడింది. అక్కడ పని చేస్తున్న సారా ప్రీతిక ఓల్డ్‌టౌన్‌కు బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. దీంతో పవన్ కుమార్‌రెడ్డి శింగనమల వెళ్లకుండా అరవింద నగర్‌లోనే పోస్టింగ్ తెచ్చుకోవాలని భావించి చక్రం తిప్పారు. అందుకు డివిజనల్ కార్యాలయ ముఖ్య అధికారులు అంగీకరించారు. ఈ వ్యవహారం వెనుక పెద్ద ఎత్తున డబ్బు చేతులు మారినట్లు చర్చ నడుస్తోంది.

ఏఎస్పీ ఉమామహేశ్వర్ ఏమన్నారంటే..

ఇదే అంశాన్ని తపాలా ఏఎస్పీ ఉమామహేశ్వర్‌ను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా.. శింగనమల సబ్‌పోస్ట్‌మాస్టర్ వెంకటేశ్వర్లు రిటైర్డ్ అయిన విషయం నిజమే. ఆయన స్థానంలో పవన్ కుమార్‌రెడ్డిని నియమించిది వాస్తవమే. పవన్ పది రోజుల కిందటే రిలీవ్ అయ్యారు కూడా.. అయితే ఆయన ఇంత వరకు జాయిన్ కాలేదు. వెంకటేశ్వర్లు నుంచి చార్జ్ తీసుకోవాల్సి ఉన్నింది. పవన్ శింగనమలకు వెళ్తారా లేక అరవిందనగర్‌కు మారుతారా అనే విషయం ఇంకో గంట టైం ఇస్తే చెప్పగలనంటూ సమాధానమిచ్చారు.

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవాలకు తరలిరండి


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) స్వర్ణోత్సవ సభలను జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం నగరంలో జిల్లా అధ్యక్షుడు ఉమేష్ నాయక్ అధ్యక్షతన పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈనెల 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో, నవంబర్ 5న విజయవాడలో 50 ఏళ్ల సభలు (స్వర్ణోత్సవాలు) జరుగుతాయన్నారు. 1975లో జరిగిన రమేజాబి ఘటనపై పీడీఎస్‌యూ ఉద్యమించిన ఫలితంగానే మహిళలను అరెస్టు చేస్తే సాయంత్రం 6 గంటల్లోపు విడుదల చేయాలనే చట్టం వచ్చిందన్నారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయీకరణకు వ్యతిరేకంగా పోరాడుతోందన్నారు. కామ్రేడ్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, రంగవల్లి, కోల శంకర్, స్నేహలత, మారోజు వీరన్న లాంటి అమరవీరుల స్ఫూర్తితో విద్యార్థి ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిందని వాటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెల ప్రసాద్, కోశాధికారి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీహరి, ఉదయ్, మహేష్ పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీధర్ రావు సేవలు అమూల్యం


డాక్టర్ మంచి శ్రీధర్ రావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఈఎన్‌టీ విభాగాధిపతిగా డాక్టర్ మంచి శ్రీధర్ రావు అందించిన సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో డాక్టర్ మంచి శ్రీధర్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో బ్లాక్ ఫంగస్ బారిన పడ్డ రోగులకు సకాలంలో శస్త్ర చికిత్సలు అందించి వారికి జీవితాన్ని ప్రసాదించారన్నారు. సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. డాక్టర్ శ్రీధర్ రావు శేషజీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామస్వామి నాయక్ మాట్లాడుతూ ..రోగుల పట్ల అత్యంత ప్రేమ, వైద్యం అందించడం, ఎవరినీ నొప్పించకుండా అత్యుత్తమ ఫలితాలు తీసుకురావడంలో శ్రీధర్ కృషి మరువలేనిదన్నారు. అనంతరం డాక్టర్ మంచి శ్రీధర్ రావు, ఆయన సతీమణి డాక్టర్ శైలజ (పెథాలజీ ప్రొఫెసర్)ను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీద్ అహమ్మద్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ షంషాద్ బేగం, తెలుగు మధుసూదన్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, వైద్యుల సంఘం కోశాధికారి డాక్టర్ వైఎంఎస్ ప్రసాద్, ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ బీమసేనాచార్, డాక్టర్ సుచిత్రశౌరీ, డాక్టర్ రామస్వామి, డాక్టర్ శివశంకర్ నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షబానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలపై ఉద్యమ బాట


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట పట్టనున్నట్లు ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు ప్రకటించారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మిని కలిసి ఉద్యమ కార్యచరణ నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన జరిగి సుమారు పదేళ్లు అవుతున్నా ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు మాత్రం వర్తించకపోవడం అన్యాయమన్నారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికీ తగినంత మంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప.. ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ, పంచాయతీ రాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్ గ్రేడ్ చెయ్యాలని డిమాండ్ చేశారు. రేపు మున్సిపాలిటీలలో చేపట్టే సత్యాగ్రహ దీక్షలో మున్సిపల్ ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. 17న డీఈఓ కార్యాలయాల వద్ద సత్యాగ్రహ దీక్ష, 24న డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా ఉంటుందని తెలియజేశారు. డీఈఓను కలిసిన వారిలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, నాయకులు కొండప్ప, చంద్రమోహన్, సిద్దన్న ఉన్నారు.

జిల్లా వ్యాప్తంగా సివిల్ రైట్స్ డే

అనంతపురము: జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా సోమవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని రాజ్యాంగం ప్రసాదించిన చట్టాలు, పౌర హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికులతో ముఖాముఖిగా మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. చట్టాలు, పౌరహక్కుల గురించి తెలుసుకుని తదనుగుణంగా జీవించాలని కోరారు. ప్రజలందరూ సమానమేనని.. ఎక్కడా వివక్ష లేకుండా గౌరవించుకుంటూ ప్రశాంతంగా జీవించాలని సూచించారు.

డీఈఓను తొలగించాలి


మాట్లాడుతున్న ఆర్ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి నిబంధనల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఉపాధ్యాయులు, ఉద్యోగులను తీవ్ర వివక్షతకు గురి చేస్తున్నారని రిజర్వేషన్ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర మండిపడ్డారు. డీఈఓను విధుల నుంచి తొలగించాలన్నారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సభ్యుడు ఎల్లన్న, ఆర్ఈఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ నాగభూషణ, గౌరవాధ్యక్షుడు రామకృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. చట్టాలు పక్కనపెట్టి అక్రమ మార్గంలో సరిచేసి తనదైన శైలిలో జిల్లాలో డీఈఓ పాలన సాగిస్తున్నారన్నారు. ఇటీవల కాలంలో సమగ్ర శిక్ష కార్యాలయంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను రూల్స్‌కు వ్యతిరేకంగా రిలీవ్ చేశారని తెలిపారు. కమిషనర్ ఉత్తర్వులను తుంగలో తొక్కారన్నారు. ఈరోజు సెక్టోరియల్ పోస్టులకు ఇంటర్వ్యూలకు పిలవడంలోనూ వివక్షత చూపించారన్నారు. ఉద్యోగులు పని భారంతో తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అత్యవసరమై ఎవరైనా ఫోన్ చేస్తే కనీసం స్పందించడం లేదని తెలిపారు.

మంత్రి గారూ మాట తప్పొద్దు

- సిఫారసు బదిలీలకు తెర తీయొద్దు
- రాష్ట్రోపాధ్యాయ సంఘం డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: తమ ప్రభుత్వంలో సిఫారసు బదిలీలు ఉండబోవని మంత్రి కాగానే నారా లోకేష్ ప్రకటించారని, ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా 16 మంది టీచర్ల బదిలీలకు రిమార్క్స్ అడగడాన్ని బట్టి చూస్తే ఈ ప్రభుత్వం అక్రమ బదిలీలకు తెర తీసిందనేది స్పష్టమవుతోందని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.రమణారెడ్డి, ఎస్.రామాంజనేయులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం చివరలో చేపట్టిన బదిలీలు ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆగిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వాటిని రద్దు చేసి, సిఫారసు బదిలీలు ఉండవని, చంద్రబాబు తీసుకొచ్చిన కౌన్సెలింగ్ విధాన స్ఫూర్తిని నిలబెడతామంటూ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని గుర్తు చేశారు. అయితే ఆ మాటకు ఆయన కట్టుబడి ఉండడం లేదనేది ఈ రోజు స్పష్టమైందన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సిఫారసు బదిలీలు చేయడానికి రంగం సిద్ధం చేశారన్నారు. 'బదిలీలు చేయడానికి ఉన్న అవకాశాలు తెలియజేయండి' అంటూ రాష్ట్ర విద్యాశాఖ నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులకు లేఖలు పంపడాన్ని ఖండించారు. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపేయాలని, బదిలీలు అంటూ జరిగితే కౌన్సిలింగ్ విధానంలో మాత్రమే జరగాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల పొలం బాట

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్‌నగర్‌లోని మినర్వా ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు సోమవారం పొలంబాట పట్టారు. రాప్తాడు మండలం హంపాపురం, గొలుపల్లిలో సాగు చేసిన వివిధ పంటలను పరిశీలించారు. పంటల సాగు విధానం, తెగుళ్లు, వాటి నివారణ, పంట సంరక్షణ, డ్రిప్, స్ప్రింక్లర వినియోగం తదితర అంశాలపై రైతులతో మాట్లాడి ఉపాధ్యాయులు వివరించారు. వివిధ ఔషధ మొక్కలను పరిశీలించి వాటిని ఎలా వినియోగిస్తారో తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూజజ విద్యార్థులకు నాలుగు గోడల మధ్య చదువు చెప్పడమే కాకుండా క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా వారికి మరింత అవగాహన కలుగుతుందన్నారు.